క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని రామవరం, మల్లంపల్లిలలో నేడు శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు రామవరం, 10:30 గంటలకు మల్లంపల్లి గ్రామాల్లోని రైతు వేదికలో నిర్వహించనున్న సమావేశానికి హాజరుకానున్నారని తెలిపారు. రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్‌జీటీల సమస్యలను పరిష్కరించండి

గజ్వేల్: ఎస్‌జీటీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌జీటీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రాత్రి గజ్వేల్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో ఎస్‌జీటీల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎస్‌జీటీలకు పీఎస్‌హెచ్‌ఎంలుగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. కొత్తగా 10 వేల పోస్టులను మంజూరు చేయాలని, ప్రతి ఎస్‌జీటీకి ఎమ్మెల్సీ ఓటు హక్కును కల్పించాలన్నారు. 317 జీవో వల్ల ఇతర జిల్లాలకు కేటాయించబడిన ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా స్థానిక జిల్లాకు కేటాయించాలని సమావేశంలో తీర్మానించారు.

ఆహ్వానం

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలో ఉన్న రాంసాగర్‌లోని చైతన్య యాదవ కులం సంఘం కమిటీ హాల్ ప్రారంభోత్సవానికి రావాలని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యుడు బీర్ల అయిలయ్యకు సంఘం సభ్యులు శుక్రవారం తన నివాసంలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా గొంగడితో ఆయనను సత్కరించారు. ఈనెల 16న కమిటీ హాల్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గంగుల మల్లయ్య, దాసరి వెంకటయ్య, గంగుల ఐలయ్య, గువ్వల రాజయ్య, దువ్వల మల్లేషం, తిప్పారం కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

13న విచారణ

సిద్దిపేటజోన్: చిన్నకోడూర్ ఎంపీపీ పరిధిలో 2014 నుంచి 2024 వరకు జరిగిన పలు ప్రగతి పనుల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని స.హ.చట్టం మేరకు చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా జెడ్పీ అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 13న ఉదయం 10.30 గంటలకు చిన్నకోడూర్ ఎంపీపీ కార్యాలయంలో విచారణ జరగనున్నట్లు జెడ్పీ సీఈఓ రమేశ్ పేరిట ఇరువర్గాలకు హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు. విచారణకు హాజరుకావాలని చిన్నకోడూర్ ఎంపీడీఓ.. సంబంధించిన ఇతర అధికారులు, ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేశారు.

వాహనాల పట్టివేత



వాహనాన్ని పట్టుకున్న ఎస్‌ఐ

నంగునూరు(సిద్దిపేట): అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్, టాటాఏస్ వాహనాలను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు రాజగోపాలపేట ఎస్‌ఐ ఆసిఫ్ తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున ముంద్రాయి వద్ద తనఖీలు నిర్వహించగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న డ్రైవర్ శివరాత్రి అశోక్‌పై, టాటాఏస్ వాహన డ్రైవర్లు దున్నపోతు భాస్కర్, కొమ్మరాజుల స్వామిపై కేసు నమోదు చేశామన్నారు.

10 శాతం రాయితీ

హుస్నాబాద్: శ్రావణ మాసం పురస్కరించుకొని ఆర్టీసీ డిస్కౌంట్ ప్రవేశ పెట్టినట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. బస్ బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

కార్యవర్గం ఎన్నిక

దుబ్బాక: పట్టణంలోని రేపాక రెడ్డి యువజన సంఘం కార్యవర్గంను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా రేపాక శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రేపాక గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎల్లంగారి పద్మారెడ్డి, కోశాధికారిగా ఎల్లంగారి గోపాల్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

సమస్యలను పరిష్కరించరూ..

నంగునూరు(సిద్దిపేట): ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్షుడు పార్థసారధి అన్నారు. శుక్రవారం ముంద్రాయి, తిమ్మాయిపల్లి, వెంకటాపూర్, నర్మేట, అంక్షాపూర్, ఖానాపూర్, గట్లమల్యాల, నంగునూరు, కస్తూర్బా గాంధీ పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

సీఐటీయూ నిరసన

సిద్దిపేటరూరల్: కేంద్ర బడ్జెట్, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సీఐటీయూ నేతల ఆధ్వర్యంలో నారాయణరావుపేటలో శుక్రవారం నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందన్నారు.

గూడు.. గోడు

- అసంపూర్తిగా 96 డబుల్ బెడ్రూం ఇళ్లు
- అధికారుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
- నిధులు కేటాయించాలని విన్నపం



పట్టణంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు

పలువురు లబ్ధిదారుల డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఈ విషయమై అధికారుల చుట్టూ తిరుగుతున్నా తమ బాధను అర్థం చేసుకోవడం లేదంటూ వాపోతున్నారు. సొంతింటి కల నెరవేరుతుందా లేదా అని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులను కేటాయించాలని వేడుకుంటున్నారు.

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు విడతల్లో 560 ఇళ్లు మంజూరు చేసింది. సగం పూర్తి కాగానే ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత ఉండాలని జిల్లా స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. అర్హులైన లిస్ట్ ప్రకారం 264 ఇళ్లకు లబ్ధిదారులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి 186 మంది లబ్ధిదారులకు పట్టాలిచ్చారు. ఈ లబ్ధిదారులు ఇక్కడే నివాసం ఉంటున్నారు. మరో 96 ఇళ్లకు 10 శాతం పనులు చేపట్టాల్సి ఉంది. వీటిలో లబ్ధిదారుల ఎంపిక చేయక ముందే గౌరవెల్లి నిర్వాసితులు 20 కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నారు.

లబ్ధిదారులు ఎదురుచూపులు...

తోటి ఎంపికైన లబ్ధిదారులు ఇళ్లల్లో కుటుంబసభ్యులతో సంతోషంగా ఉంటున్నారు తమ సంగతేంటని మిగతా వారు ప్రశ్నించుకుంటున్నారు. అసంపూర్తిగా ఉన్న వాటిని ఎప్పుడు పూర్తి చేస్తారోనని రోజూ కాలనీకి వెళ్లి చూసుకుంటున్నారు. వాటిని పూర్తి చేసి సొంతింటి కలను నెరవేర్చాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. చేతికి వచ్చినట్టే వచ్చి చేజారిపోతుందేమోనని మదనపడుతున్నారు. కూలీనాలీ చేసుకొంటూ అద్దె ఇళ్లలో కష్టంగా బతుకుబండిని సాగిస్తున్నారు. పట్టాలు చేతికందగానే గృహ ప్రవేశమే ఆలస్యం అనుకుంటే ఏళ్ల పాటు నిరీక్షించాల్సి వస్తుందన్నారు. కొందరికి న్యాయం చేశారని చెబుతున్నారు. తమ పట్ల కూడా దయ చూపాలని వేడుకుంటున్నారు. కాగా, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు రాగానే ఇళ్లను పూర్తి చేస్తామంటూ అధికారులు చెబుతున్నారు.

నా ఇల్లు ఇంకా పూర్తి కాలేదు



మాకు ఇల్లు లేక అద్దె ఇంటిలో ఉంటున్నాం. కూలి పనులు చేస్తే గానీ పూట గడవదు. డబుల్ బెడ్రూం ఇంటి పట్టా ఇవ్వగానే సంతోషపడ్డా. సొంత ఇంటితో కిరాయి బాధలు తీరాయనుకున్నాం. లబ్ధిదారులు అందరూ కలిసి ఇళ్ల కాలనీకి వెళ్లాం. నంబర్ల వారికి ఎవరి ఇంటిలోకి వారు వెళ్లారు. నాకు కేటాయించిన ఇల్లు పూర్తి కాలేదు. ఈ విషయమై అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కొందరి ఇళ్లు పూర్తి చేసి మరికొందరివి చేయకపోవడం అన్యాయం. ఇప్పటికై నా నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నా.

: జేరిపోతుల సునీత, హుస్నాబాద్

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని..

దుబ్బాక: పట్టణంలోని దుంపలపల్లి రోడ్డులో షాదీఖాన ఎదుట ప్రభుత్వ భూమిని కబ్జాచేసి అక్రమ నిర్మాణం చేపడుతున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గొడ్డుబర్ల భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్యాలయం ప్రతినిధికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విలువైన ప్రభుత్వ భూమితో పాటు కల్వర్టును కబ్జా చేశారన్నారు. చుట్టూ పెన్సింగ్ చేసి అక్రమంగా నిర్మాణం చేపడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భాస్కర్,లక్ష్మీనర్సయ్య,రాజు తదితరులు ఉన్నారు.



మున్సిపల్ కార్యాలయ ప్రతినిధికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు



దుబ్బాకరూరల్: మొక్కలు నాటుతున్న జెడ్పీ సీఈఓ

స్వచ్ఛతే లక్ష్యంగా..

జిల్లావ్యాప్తంగా స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా స్వచ్ఛదనం పచ్చదనంతోనే ఆరోగ్యంగా ఉంటారని వక్తలు అన్నారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలన్నారు. వాటితోనే మానవ మనుగడ ముడిపడి ఉందన్నారు. ప్రతీఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని జెడ్పీ సీఈఓ రమేశ్ అన్నారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని సిద్దిపేట అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించుకోవాలని తద్వారా కాలుష్యం తగ్గుతుందన్నారు. కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లు సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. దుబ్బాక మున్సిపల్‌లోని చెల్లాపూర్ 2వ వార్డులో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

– నెట్‌వర్క్



దుబ్బాక: చెల్లాపూర్‌లో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న చైర్‌పర్సన్ వనిత



హుస్నాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ..



సిద్దిపేటజోన్: 41వ వార్డులో మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని, అలాగే చదువులోను రాణించాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చింతమడకలో ఉన్న మహాత్మా జ్యోతి రావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె.. పాఠశాల ఆవరణంలో మొక్కను నాటారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ బాగా చదువుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీధర్‌శర్మ, తహసీల్దార్ హరికిరణ్, ఎంపీఓ శ్రీనివాస్‌రావు, హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ వినోద్ బాబ్జి, మెడికల్ ఆఫీసర్ బాపు రెడ్డి, ప్రిన్సిపాల్ మాదవి, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

ప్రమాదాల నివారణకే సేఫ్టీ సిగ్నల్స్



దుద్దెడ మలుపు వద్ద సూచికబోర్డు ఏర్పాటు చేయిస్తున్న సీఐ విద్యాసాగర్

కొండపాక(గజ్వేల్): ప్రమాదాల నివారణకే రోడ్ స్టాపర్, రోడ్ సేఫ్టీ సిగ్నల్స్ అని త్రీ టౌన్ సీఐ. విద్యాసాగర్ అన్నారు. రాజీవ్ రహదారి రాష్ట్ర హైవే కావడంతో వాహనదారులు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. శుక్రవారం దుద్దెడలోని రాజీవ్ రహదారిపై ఉన్న మలుపు వద్ద తరుచుగా ప్రమాదాలు జరుగుతుండటంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నెల రోజుల వ్యవధిలో 2 నుంచి 3 వాహనాలు అదుపు తప్పి బోల్తా పడ్డాయని, ఎలాంటి ప్రాణనష్టం లేదన్నారు. ఆ మేరకు ప్రమాద స్థలానికి సుమారు 100 మీటర్ల దూరం వరకు రోడ్డును పరిశీలించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు..

నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు దోహదపడుతాయని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. మండల పరిధిలోని దమ్మక్కపల్లిలో సైబర్ నేరాల నియంత్రణ, సీసీ కెమెరాల ఉపయోగాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలు కంటికి కనపడని పోలీసుల్లాంటివన్నారు. సాక్ష్యాలు చెప్పడంలో కొందరు స్వార్థ ప్రయోజనాలకు లొంగిపోయే చాన్స్ ఉందన్నారు. కానీ సీసీ ఫుటేజీల సాక్ష్యానికి తిరుగు ఉండదన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు.

13 మందికి జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, బస్టాండ్ చౌరస్తా, విక్టరీ చౌరస్తా, రాజీవ్ రహదారిపై వారం రోజులపాటు పలుచోట్ల వాహనాలు ఆపి ట్రాఫిక్ పోలీసులు తనిఖీ నిర్వహించారు. ఇందులో 13 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో శుక్రవారం హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి రూ.15,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

గజ్వేల్‌రూరల్: కేరళలోని వాయనాడులో వరదల్లో కొట్టుకు పోయిన కుటుంబాలను ఆదుకోవడంతో పాటు ఈ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారులోగల రాణే పరిశ్రమలో వాయనాడు బాధితుల కోసం విరాళాలను సేకరించారు. అనంతరం ఎల్లయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సైతం ఈ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

మల్లన్న ఆలయంలో వేలం పాటలు

కొమురవెల్లి(సిద్దిపేట): స్థానిక మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం బహిరంగ వేలం పాటలు ఈఓ బాలాజీ శర్మ ఆధ్వర్యంలో జరిగాయి. రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరి కాయల విక్రయించే టెండర్‌ను ఎ.రవీందర్ రూ12.50 లక్షలకు పాడి దక్కించుకున్నారు. తలనీలల సేకరణ కోసం నిర్వహించిన టెండర్‌లో సరైన పాట రాకపోవడంతో వాయిదా వేశారు.

కాళేశ్వరం కేసీఆర్ మానస పుత్రిక

మర్కూక్(గజ్వేల్): కేసీఆర్ మానసపుత్రిక కాళేశ్వరం అని, తెలంగాణ రైతాంగానికి సాగు నీరు అందించడంతో కేసీఆర్ కల సాకారమైందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గోదావరి నుంచి కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులోకి నీరు వదలడంతో మండల కేంద్రమైన మర్కూక్‌లో కొండపోచమ్మ సాగర్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులు పూలు చల్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు వరి నాట్లు వేసుకుని నీళ్ల కోసం ఎదురు చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించలేదన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన సాగు నీటి కోసం ధర్నా చేస్తామని హెచ్చరించామని, దీంతో ప్రభుత్వం దిగొచ్చి గోదావరి నీటిని ప్రాజెక్టులోకి వదిలిందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కౌన్సిలర్లు కనకయ్య, రవీందర్, ఆహ్మద్, స్వామి, బీరయ్య, వెంకటేశం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కొండపోచమ్మ సాగర్ లో వద్ద పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ మత్తుకు బానిసలు కావద్దు

గజ్వేల్‌రూరల్: యువత మత్తుకు బానిసలు కావద్దని గజ్వేల్ సీఐ సైదా పేర్కొన్నారు. మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, సెల్‌ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌లు, ఓటీపీలకు స్పందించవద్దన్నారు.

◆ వచ్చే ఎన్నికల్లో సత్తా చాటాలి

ములుగు(గజ్వేల్): రానున్న యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో యువకులు తమ సత్తా చాటాలని పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు మండలం వంటిమామిడిలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన శుక్రవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల దృష్ట్యా యువకులు అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయించాలని సూచించారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సుభాశ్‌రెడ్డి అందజేశారు. ఎంపీ రఘునందన్ ఆదేశాల మేరకు లబ్ధిదారుడు దేవుని రమేశ్ రూ.60 వేలు, బండి రాధ రూ.13 వేలు, ఎల్లవ్వ రూ.14 వేలు, దొమ్మాట ఎల్లవ్వ రూ.9 వేలు, నర్సవ్వ రూ.13 వేలు, విశ్వనాథం రూ.12 వేల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీను, రాజు, బాలరాజు, బాబు, యాదగిరి, ప్రవీణ్ ఉన్నారు.

◆ నూతన కమిటీ నియామకం

కొమురవెల్లి(సిద్దిపేట): బీజేపీ కిసాన్ మోర్చా నూతన మండల కమిటీని నియమించారు. కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడిగా గురువన్నపేటకు చెందిన తడకపల్లి కనుకయ్య, మండల జాయింట్ సెక్రటరీగా దాసరిబాబు నియమితులయ్యారు. ఆ మేరకు నియామక పత్రాలను పార్టీ మండల అధ్యక్షుడు బుర్గోజు నాగరాజు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కుడికుడి మల్లేశం, ప్రధానకార్యదర్శి పుట్ట కనుకయ్య, మండల ఉపాధ్యక్షులు వంగా శివారెడ్డి, సనాధి కరుణాకర్ పాల్గొన్నారు.

◆ మండల కార్యవర్గం ఎన్నిక

మద్దూరు(హుస్నాబాద్): తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం మద్దూరు మండల నూతన కమిటీ ఎన్నికైంది. శుక్రవారం అధ్యక్షుడిగా పోతుగంటి లింగం, ఉపాధ్యక్షులుగా తాళ్లపల్లి జనార్దన్, మల్లేశం, వగలబోయిన రాజు, ప్రధానకార్యదర్శిగా బండి నర్సింహులు గౌడ్, మండల కోశాధికారిగా శంకయ్యగౌడ్‌లు ఎన్నికయ్యారు.

◆ రుద్రాభిషేకం

కొండపాక(గజ్వేల్): శ్రావణ మాస శుక్రవారాన్ని పురస్కరించుకొని మండలంలోని మర్పడ్గలో గల విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం గావించారు. క్షేత్రం ఆవరణలో ఉన్న సుబ్రమణ్యేశ్వర స్వామికి కూడా పంచామృత ఫలరస అభిషేకాన్ని చేశారు. అన్నదాన వితరణ గావించారు. దుర్గామాతను పట్టు వస్త్రాలతో అలంకరణ చేశారు. కాగా క్షేత్రం నిర్వాహకులు చెప్పెల హరినాథ శర్మ పర్యవేక్షించారు.

◆ గాయపడిన వ్యక్తి మృతి

మద్దూరు(హుస్నాబాద్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందిన సంఘటన చేర్యాలలో జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల మండలం కమాలయపల్లికి చెందిన పంజా శ్రీనివాస్(42)ను 15 రోజుల క్రితం దుద్దెడ క్రాస్ రోడ్డు వద్ద హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ చికిత్సపొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు.

◆ వ్యాక్సినేషన్

జగదేవ్‌పూర్(గజ్వేల్): పెంపుడు జంతువులతో అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి శ్వేత అన్నారు. శుక్రవారం జగదేవ్‌పూర్‌లో పశువైద్య కేంద్రంలో పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలను వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా నాగుల పంచమి

నాగుల పంచమి పర్వదినం సందర్భంగా శుక్రవారం నాగదేవతలకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టల్లో చక్కెర, పూలు, పాలు పోశారు. హుస్నాబాద్‌లో నాగులమ్మ దేవాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పూజలు చేశారు. జిల్లావ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో మహిళలు కూడా నాగదేవతల పుట్టల వద్ద పాలు పోసి, నైవేద్యాలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.

– నెట్‌వర్క్



హుస్నాబాద్: మరకత లింగేశ్వర ఆలయంలో..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట) : రంగధాంపల్లిలో..



కోహెడ(హుస్నాబాద్)లో..



చేర్యాలలో..



బెజ్జంకిలో...



కొండపాక(గజ్వేల్): మర్పడ్గలో ..



దుబ్బాకటౌన్‌లో..